www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

గురువారం । 9 । ఏప్రిల్ । 2026




## మాత శిశు సంరక్షణకు కృషి

- కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, అక్షిత బ్యూరో:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయడం ద్వారా మాతా శిశు సంరక్షణకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఆర్.ఎం.ఓ. మిగతా.. 2లో



- కరీంనగర్ పోలీస్‌ల కొరడా
- మార్చి నెలలో విస్తృత తనిఖీలు
- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

# అక్రమ ఇసుకపై ఉక్కుపాదం

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా, నిల్వ మరియు విక్రయాలపై కఠిన చర్యలుకొనసాగుతున్నాయని పోలీస్ అధికారులు తెలిపారు. మార్చి నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 120 కేసులు నమోదు చేసి, 139 వాహనాలను స్వాధీనం చేసుకుని, 161 మంది నిందితులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మిగతా.. 2లో



## కమీషన్లకు కాంగ్రెస్ కార్యకర్తల కొట్లాట!

- అధికారుల ముందే పంపకాల వ్యవహారం
- పోలీస్ స్టేషన్‌కు చేరిన సీసీ రోడ్లు కమీషన్ల పంచాయతీ

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** బిజినపల్లి మండలం బోయాపూర్ గ్రామంలో ఏడాది క్రితం రు.10 లక్షలతో వేసిన సీసీ రోడ్డు కమీషన్ల పంచాయతీ బుధవారం పోలీస్ స్టేషన్ కు చేరింది.

రూ.10 లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి బోయపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు రూ.70 వేలు వసూళ్లు చేయగా వాటి పంపకంలో సయోధ్య మిగతా.. 2లో



## అతివేగం వద్దు ప్రాణం ముద్దు


- హెల్మెట్ తప్పనిసరి - లేనిచో కఠిన చర్యలు
- పోలీసులు వెహికల్ చెకింగ్ రోడ్డు భద్రతపై అవగాహన
- ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం
- పాటించాలని తోటి వాహనదారులకు చెబుదాం..!
- ట్రాఫిక్ నిబంధనలు మన కుటుంబానికి రక్ష
- సిఐ ఎన్.వెంకటేశ్వర్లు

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలంలో రోడ్డు భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్సై డి. నాగ రాజు ఆధ్వర్యంలో మంగళవారం మిగతా.. 2లో

## తుక్కుగూడ ఫ్యాబ్ సిటీలో డీజీపీ తనిఖీ

- కమిషనర్ కార్యాలయం నిర్మాణ పనులపై సమీక్ష

**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, తుక్కుగూడ ఫ్యాబ్ సిటీలో బుధవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న పోలీస్ కమిషనర్ కార్యాలయ భవనాన్ని పరిశీలించి, జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు.



అధికారులు భవనంలోని వివిధ భాగాలను సందర్శించి, అక్కడ జరుగుతున్న సివిల్ పనులు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజ్ వంటి పనులను పరిశీలించారు. పనులు ఎలా జరుగుతున్నాయో చూసి, అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, కమిషనర్ కార్యాలయం అన్ని అవసరమైన సౌకర్యాలతో ఉండేలా నిర్మించాలన్నారు. పోలీస్ సిబ్బంది సౌకర్యంగా పని చేసేలా కార్యాలయం ఉండాలని, ప్రజలకు సేవలు సులభంగా అందేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇంకా మిగిలి ఉన్న పనులను త్వరగా మిగతా.. 2లో

# అక్రమ ఇసుకపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి..

అక్రమ ఇసుక రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా, రోడ్డు భద్రత, పర్యావరణ సమతుల్యత, ప్రజా శాంతి భద్రతలపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు.

### డివిజన్ వారీగా చర్యలు

టౌన్ డివిజన్ పరిధిలో 15 కేసులు, 12 వాహనాల స్వాధీనం, 15 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు. రూరల్ డివిజన్ పరిధిలో అత్యధికంగా 73 కేసులు, 79 వాహనాల స్వాధీనం, 98 మంది నిందితులపై కేసులు నమోదయ్యాయి.

హుజురాబాద్ డివిజన్ పరిధిలో 32 కేసులు, 48 వాహనాల స్వాధీనం, 48 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌ల వారీగా ముఖ్య గణాంకాలు మార్చి నెలలో

కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 28 ఎఫ్ఐఆర్‌లు, 36 వాహనాల స్వాధీనం, 40 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.

జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు, 24 వాహనాల స్వాధీనం, 24 మంది నిందితులు నమోదు అయ్యారు.

ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు నమోదయ్యాయి.

మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 కేసులు, 10 వాహనాలు, 15 మంది నిందితులు గుర్తించబడ్డారు.

కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9 కేసులు, 6 వాహనాలు, 9 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది మార్చి వరకు సమగ్ర గణాంకాలు

2026 సంవత్సరంలో మార్చి నెల వరకు కమిషనరేట్ పరిధిలో మొత్తం 245 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, 357 వాహనాలను స్వాధీనం చేసుకుని, 422 మంది నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. డివిజన్ వారీగా

టౌన్ డివిజన్‌లో 24 కేసులు, 27 వాహనాలు, 32 నిందితులు

రూరల్ డివిజన్‌లో 139 కేసులు, 203 వాహనాలు, 241 నిందితులు

హుజురాబాద్ డివిజన్ లో 82 కేసులు, 127 వాహనాలు, 149 నిందితులు పోలీసుల హెచ్చరిక అక్రమంగా ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, విక్రయాల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. "అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించము. సంబంధిత పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు, నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం" అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# అతివేగం వద్దు ప్రాణం ముద్దు

మొదటి పేజీ తరువాయి..

ప్రధాన రహదారులపై విస్తృతంగా వెహికల్ చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల పత్రాలు పరిశీలించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు స్పష్టంగా సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమని, చిన్న నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సురేందర్, కానిస్టేబుల్ నరసింహ, సురేష్, మధు, ప్రవీణ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:

ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభలు హైదరాబాద్‌లో రవీంద్ర భారతిలో ఏప్రిల్ 15,16,17 తేదీలలో జరుగుతున్నాయి.. ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని కల్వకుర్తి యుటిఎఫ్ భవన్లో యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు ఏపీ మల్లయ్య కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పరశురాములు ముఖ్య అతిథులుగా పాల్గొని కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి వెంకటేష్, జిల్లా కార్యదర్శి రసమల్ల లక్ష్మణ్, జిల్లా గౌరవ అధ్యక్షులు బొల్లె జగన్..మరియు జిల్లా సహాయ కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.



# కమీషన్లకు కాంగ్రెస్ కార్యకర్తల కొట్లాట!

మొదటి పేజీ తరువాయి..

కుదరకపోవడంతో ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఏకంగా అధికారుల ముందే పంపకాలు జరుపుకోవడం అందులో అయోధ్య కుదరకపోవడంతో ఒకరి మీద ఒకరు దాడి చేసుకున్న పరిస్థితి నెలకొంది. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకోగా చివరికి పెద్ద సారు మందలించినట్లు తెలిసింది. చివరగా ఈ పంచాయతీ పెద్ద సార్ ముందుకు వెళ్లడంతో చర్చనీయంశంగా మారింది. మండలంలోని బోయాపూరు గ్రామంలో ఏడాది క్రితం రూ.10 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు కాగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డు వెయ్యడానికి కాంట్రాక్టర్ వద్ద నుండి రూ.70 వేలకు ఒప్పందం చేసుకున్నారు. తర్వాత 8.5 లక్షల బిల్లు ఈ వారమే కాంట్రాక్టర్ ఖాతాలో పడింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు కాంట్రాక్టర్ వద్ద నుండి రూ.70 వసూళ్లు చేశారు. కమీషనులో రూ.50 వేలు అధికారి సాక్షిగానే బదిలీ అయింది. ఆ తర్వాతనే చెక్కు డిపాజిట్ అయి కాంట్రాక్టర్ చేతికి డబ్బులు ముట్టాయి. మొత్తం రూ. 70 వేల కమిషనులో రూ.60 వేలు యూపిఐ ద్వారా పేమెంట్ కాగా, మిగిలిన పదివేలు నగదు రూపకంగా బదిలీ చేసుకున్నారు. సోమవారం ఈ పంపకాలు పూర్తి కాగా మంగళవారం సాయంత్రం బొయాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో గాయపడిన సైదులు అనే కార్యకర్త పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయంలో బిజినపల్లి ఎస్సై శ్రీనివాసులను వివరణ కోరగా బోయపూర్ గ్రామానికి చెందిన సైదులు అనే వ్యక్తి నుండి ఫిర్యాదు అందిందని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

# మాత శిశు సంరక్షణకు కృషి

మొదటి పేజీ తరువాయి..

శ్రీధర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. శుద్ధమైన త్రాగునీరు, నాణ్యమైన పోషక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని, వ్యాధులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణీల వివరాలు నమోదు చేసి సమయానుసారంగా చేసుకోవలసిన వైద్య పరీక్షలు, తీసుకోవలసిన ఆహారం, పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంపొందించడం జరిగిందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆసుపత్రులు, సామాజిక ఆసుపత్రులు, ప్రభుత్వ ఆసుపత్రులు, పల్లె, పట్టణ దవాఖానాలు, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మాతా శిశు ఆసుపత్రి ఉన్న ప్రాంతంలో వరద నీటి ఇబ్బంది ఉన్నందున త్వరలో పూర్తి కానున్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. లక్షెట్టిపేట సామాజిక ఆసుపత్రి, బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, చెన్నూర్ మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం



జరుగుతుందని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తల నుండి వైద్యుల వరకు గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం స్టాఫ్ నర్సులు, సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని, స్నేహపూర్వక వాతావరణం లో వైద్య చికిత్స అందించాలని తెలిపారు.

అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుక్కుగూడ ఫ్యాబ్ సిటీలో డీజీపీ తనిఖీ

మొదటి పేజీ తరువాయి..

పూర్తి చేయాలని, పనులు ఆలస్యం కాకుండా చూడాలని ఇంజనీర్లకు సూచించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిర్ణయించిన సమయానికి పనులు పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం, మీర్ ఖాన్‌పేట్ ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాలను అధికారులు సందర్శించారు. అక్కడ భవిష్యత్తులో కమిషనర్ కార్యాలయం పనులు నిర్మించాల్సిన శాశ్వత భవనాల మాస్టర్ ప్లాన్‌పై సంబంధిత అధికారులతో చర్చించారు. స్థలాలను పరిశీలించిన అధికారులు, భవనాల నిర్మాణానికి అవసరమైన విషయాలను చూసి, పనులు త్వరలోనే ప్రారంభించాలని సూచించారు. ఈ నిర్మాణాల వల్ల ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందుతాయని తెలిపారు.

త్వరలోనే తుక్కుగూడ నుంచి పూర్తి స్థాయి పోలీస్ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కొత్త కార్యాలయం ద్వారా సేవలు మరింత సులభంగా, వేగంగా అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ.కె పి వి. రాజు, ఏసీపీ అరుణ్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడులు పెన్నులు అందజేత

### మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిడిశెట్టి ప్రభాకర్

నంగునూరు, అక్షిత ప్రతినిధి:

వెంకటాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నంగునూరు మండల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ పిడిశెట్టి ప్రభాకర్ పరీక్ష ఫ్యాడులు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు నాణ్యతమైన భోజనం ఏర్పాటు చేస్తుంది. విద్యార్థులు అన్ని



రంగాలలో ముందుండాలని కృషి చేస్తుంది. సిద్దిపేట నియోజకవర్గంలో ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్ని పాఠశాలలకు మరియు నియోజకవర్గ అభివృద్ధి కి ఎంతగానో కృషి చేస్తున్నారాని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామరాజు పాఠశాల ఉపాధ్యాయులు, మరియు లింగంపల్లి భాస్కర్ మహారాజ్, పోతురాజు కనకరాజు, లింగంపల్లి యాదగిరి, పోతరాజు మనోజ్, లింగంపల్లి అజయ్, తదితరులు పాల్గొన్నారు.



## సత్తుపల్లి పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్

# బడిబాట కార్యక్రమం

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణంలో బండి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రిహానా కమల్ పాషా పాఠశాలలో కొత్తగా విద్యార్థుల నమోదు చేసిన ఈ బడి బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ రిహాన కమల్ పాషా మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైనవిద్యను వినియోగించు



కోవాలని, తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి పిల్లవాడు పాఠశాలకు క్రమంగా హాజరవటంఅవసరమనిపేర్కొన్నారు.మండల విద్యాశాఖ అధికారి యన్.రాజేశ్వరరావుమాట్లాడుతూ

బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు పెంపు డ్రాప్ ఔట్లు నివారణ, మరియు నాణ్యమైన విద్య అందించుటకు ముఖ్య లక్ష్యమని తెలిపారు.ప్రధానోపాధ్యాయులు ఆర్. శైల కుమారి మాట్లాడుతూఈ విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో అత్యధిక విద్యార్థులను చేర్పించాలని పిలుపునిచ్చారు. చివరగా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు ప్రతి విద్యార్థి పాఠశాలలో చేరినాణ్యమైన విద్యను పొందేలా అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, కమల్ పాషా,18వ వార్డు కౌన్సిలర్ పరసా మానసరాము ,యంఈఓయన్. రాజేశ్వరరావు, హెచ్ ఎం ఆర్. శైల కుమారి, పాఠశాల సిబ్బంది రాణికుమారి, సరిత, అబ్దుల్ మజీద్, వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ కృష్ణకుమారి, పద్మ , విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాద బీమాతో

# కుటుంబాలకు ధీమా

### గ్రామ సర్పంచి బెట్టరీ రేణుక నాగరాజ్

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం ప్రతి ఒక్కరూ తపాలా శాఖ అందిస్తున్న ప్రమాద బీమా పథకాలను తీసుకోవాలని వనపర్తి డివిజన్ తపాలా పర్యవేక్ష కులు భూమన్న పేర్కొన్నారు. బుధవారం పెద్ద కొత్తపల్లిలో తపాలా ప్రమాద బీమా క్యాంప్ లను



సర్పంచి బెట్టరీ రేణుక నాగరాజ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. 18 నుంచి 65 ఏళ్లలోపు వారికి తక్కువ ప్రీమియంతో రూ.కోటి రూపాయలు ప్రమాద బీమా పథకాలను ఒక వ్యక్తిపై చేయించుకోవచ్చు ని భూమన్న తెలిపారు. యువత అనునిత్యం బయటి పనులకు వెళ్తుంటారని ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే ఆయా కుటుంబాలకు ఈ పథకాల ద్వారా భరోసా ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పోస్టల్ కి వెళ్లి ప్రతి ఒక్కరు బీమా పథకాలు పొందాలన్నారు. పెద్దకొత్తపల్లి సర్పంచ్ బెటర్ రేణుక నాగరాజు మాట్లాడుతూ తపాల శాఖ అందిస్తున్న బీమా పథకాలు ప్రతి ఒక్కరు చేయించుకోవాలన్నారు. తపాల శాఖ అందిస్తున్న బీమా పథకాలను తమ గ్రామ పంచాయతీ సిబ్బందికి చేయించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తబలా బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ ఎస్ పి ఎం తిరుపతి మాజీ సర్పంచ్ జక్కుల నరసింహ ఉప సర్పంచ్ మంజుల గ్రామీణ తపాలా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# గ్రీవెన్స్ డేలో ప్రజల వినతులు విన్న ఎస్పీ జానకి షర్మిల

### ఫిర్యాదుల పరిష్కారానికి వెంటనే చర్యలు

### షీ టీం కౌన్సిలింగ్‌తో కుటుంబాల కలయిక

**నిర్మల్, అక్షిత బ్యూరో:**

భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది ఫిర్యాదుదారుల వినతులను స్వీకరించిన ఎస్పీ, ప్రతి అంశాన్ని గంభీరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు దారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి, చట్టపరమైన సహాయాన్ని ఆలస్యం లేకుండా అందించాలని స్పష్టం చేశారు.

**షీ టీం ద్వారా కౌన్సిలింగ్**

కుటుంబ వివాదాలకు సంబంధించిన పలు కేసుల్లో షీ టీం సభ్యులు ఇరు వర్గాలతో మాట్లాడి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో కొన్ని కుటుంబాలు తిరిగి కలిసినట్లు సమాచారం. భైంసాలోనే కౌన్సిలింగ్ అందించడం వల్ల బాధితులకు సౌకర్యం కలిగిందని వారు అభిప్రాయపడ్డారు.

**పెండింగ్ కేసులపై దృష్టి**

ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని ఎస్పీ సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### అసంగటిత రంగాలలో పనిచేస్తున్న మహిళల కోసం

# సఖి అవగాహన కార్యక్రమం

### సఖీ సెంటర్ అడ్మిన్ సునీత

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:**

సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో కూలీ చేసే మహిళలకు వారి హక్కులు, భద్రత మరియు అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కార్యక్రమం బిజినపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ సఖీ సెంటర్ అడ్మిన్ సునీత,మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలకు గృహ హింస, పనిస్థల వేధింపులు, బాలల రక్షణ, చట్టపరమైన హక్కులు వంటి అంశాలపై అవగాహన కల్పించబడింది. సఖి సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలు అయిన అత్యవసర సహాయం, వైద్య




సహాయం, పోలీస్ సహకారం, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ , తాత్కాలిక ఆశ్రయం రెస్క్యూ సదుపాయం గురించి వివరించారు.

ఈ సందర్భంగా మహిళలకు 181 మహిళా హెల్ప్‌లైన్ గురించి తెలియజేసి, ఎలాంటి భయపడకుండా సహాయం పొందాలని సూచించారు. హింసను నిర్భయంగా ఫిర్యాదు చేయడం ఎంత ముఖ్యమో వివరించారు.

కార్యక్రమంలో మహిళలతో పరస్పర చర్చలు నిర్వహించి, వారి సమస్యలను వినిపించుకున్నారు. అవగాహన కోసం పాంప్లెట్లు కూడా పంపిణీ చేశారు. మహిళలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

సఖి సెంటర్ మహిళల భద్రత, గౌరవం మరియు సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తుందని సఖీ సెంటర్ అడ్మిన్ సునీత మరియు కౌన్సిలర్ అర్షియా తెలిపారు.



# సికెఎం ఆసుపత్రిలో సురక్షిత మాతృత్వ దినోత్సవం

### గర్భిణులకు సరైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్,ఎమ్మెల్యే

**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సి.కే.ఎం ప్రసూతి ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తల్లి ప్రాముఖ్యతపై మాట్లాడి, తల్లి మరియు శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం, సమయానుకూల వైద్య పరీక్షలు, సురక్షిత ప్రసవంపై వివరించారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే తల్లి-శిశు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సి.కే.ఎం ప్రసూతి ఆసుపత్రిలోని ఓపీ ఇతర వార్డులను ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి సందర్శించి గర్భిణీలకు



అందిస్తున్న వైద్య సేవలను నేరుగా తెలుసుకున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణీలతో మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వైవి గణేష్, సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



# సురక్షిత మాతృత్వం ద్వారా తల్లి-శిశు మరణాల రేటును తగ్గించడం సాధ్యమవుతుంది

**ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**సురక్షిత ప్రసవాన్ని నిర్ధారించుకోవాలి : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, అక్షిత బ్యూరో:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో వైద్య శాఖ అధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాలు ఏప్రిల్ 6 నుండి 11 వరకునిర్వహిస్తున్న కార్యక్రమములో బాగంగా కల్లెక్ట్రేట్ కార్యాలయ సమావేశ హాలు నందు జిల్లావిద్యా ఆరోగ్యా శాఖ అధికారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తల్లి-శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా సురక్షిత మాతృత్వంపై దృష్టి సారించాలని, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు, పోషకాహార కార్యక్రమాలు మరియు ప్రసవ సదుపాయాలపై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

ప్రతి గర్భిణీ స్త్రీ తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రీ-నాటల్ చెకప్‌లు చేయించుకోవాలని, కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని సూచించారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగం, టీకాలు సమయానికి తీసుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం పై అవగాహన పెంచాలని తెలిపారు.

తప్పని సరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వంద శాతం సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని, హోమ్ డెలివరీలను తగ్గించి ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలను పెంచాలని, అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఆశా, ఏఎన్ఎం సిబ్బంది గ్రామస్థాయిలో గర్భిణీలను గుర్తించి, వారికి అవసరమైన సేవలు అందేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తల్లి-శిశు మరణాల రేటును తగ్గించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తల్లి బిడ్డ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడిలు ఆశలు, అధికారులు గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి స్వర్ణ కుమారి, డి సి ఎచ్ ఎస్ డాక్టర్ ఆనంద్, డి ఆర్ డి ఎ శ్రీనివాస్, జి జి ఎచ్ ఎస్ సూపర్డెంటైంట్ రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, ప్రోగ్రాం అధికారులు రవీందర్, పవిత్ర, డి డబ్ల్యూ ఓ కృష్ణవేణి, సంబంధిత అధికారులు ,ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**జడ్చర్ల, అక్షిత న్యూస్:** ఇచ్చిన మాట ప్రకారంగా ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇచ్చే పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచి ఇప్పించినందుకు ధన్యవాదాలు చెబుతూ ఉదండాపూర్ కు చెందిన గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయన పట్ల తమకు ఉన్న ప్రేమాభిమనాలను,కృతజ్ఞతలను చాటుకున్నారు.


ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇది వరకు సింగిల్ ఫ్యామిలీ కింద రూ.6.5 లక్షలు, జాయింట్ ఫ్యామిలీ కింద రూ.16 లక్షలు ఇస్తామని గతంలో ప్రకటించారు. అయితే ఈ పరిహారాన్ని పెంచి ఇప్పిస్తామని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చిన అనిరుధ్ రెడ్డి ఆ తర్వాత తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కూడా ఇదే మాటపై నిలబడ్డారు. ఉదండాపూర్ నిర్వాసితులు అందరి మంచి కోసం తమ జీవితాలను త్యాగం చేసారని అలాంటి వారికి ఇచ్చే పరిహారం పెంచి ఇవ్వాలని, అలాగే సింగిల్ ఫ్యామిలీ జాయింట్ ఫ్యామిలీ అనే తేడాల్లేకుండా అందరికీ కూడా ఒకే విధంగా పెంచిన పరిహారాన్ని చెల్లించాలని గట్టిగా పట్టుబట్టారు.

ఈ విషయం గురించి సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మినిష్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డితో పలుమార్లు సమావేశమై ఉదండాపూర్ నిరా వ్రసితుల పక్షాన నిలబడ్డారు. అనిరుధ్ రెడ్డి నిర్విరామంగా చేసిన కృషి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇచ్చే పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచింది, దీంతో గతంలో రూ.6.5 లక్షలు మాత్రమే వస్తుందనుకున్న వారికి కూడా ఇప్పుడు అదనంగా రూ.12 లక్షలు, అలాగే ఇదివరకు రూ.16 లక్షలు ఇస్తామన్న వారికి అదనంగా రూ.2 లక్షలు చొప్పున ఉదండాపూర్ నిర్వాసితులకు అదనంగా రూ.142 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. పెంచిన ఈ పరిహారంలో రూ.150 కోట్లు ఇటీవల విడుదల చేసింది.

మరో రూ.200 కోట్ల వరకూ ఈనెలలోనే విడుదల చేస్తామని కూడా హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే అనిరుధ్ రెడ్డి చేసిన కృషితో తమ జీవితాల్లో వెలుగు వచ్చిందని ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఉదండాపూర్ గ్రామ సర్పంచ్, డిప్యుటీ సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర నేతల ఆధ్వర్యంలో గ్రామస్తులు జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తమ పట్ల చూపిన ప్రమాభిమానాలకు తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉదండాపూర్ సర్పంచ్ తంగెళ్లపల్లి శేఖర్, డిప్యుటీ సర్పంచ్ మ్యాతరి నరేష్, వార్డు సభ్యులు జహంగీర్, జ్యోతి శేఖర్, సుధారాణి లింగం గౌడ్ పార్టీ నేతలు జడ్చర్ల మల్లయ్య, పాతింటి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపూర్ గ్రామంలో విషాద ఘటన

**కాల్వలో మునిగి విద్యార్థి మృతి**



**నాగర్‌కర్నూల్,అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దాపూర్ గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది రవికుమార్ (16) అనే విద్యార్థి కాల్వలో మునిగి మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన రవికుమార్, కాల్వలో ప్రవాహం వేగంగా ఉండటంతో అదుపు తప్పి నీటిలో కొట్టుకు పోయాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రాత్రంతా వెతికినా అతని ఆచూకీ లభ్యం కాలేదు.బుధవారం ఉదయం తలుపునూరు సమీపంలోని కాల్వలో రవికుమార్ మృతదేహాన్ని గుర్తించారు. గుడిపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చిన ప్రవాహంతో మృతదేహం అక్కడికి చేరినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.



# ఇంటి ఇంటికి సిపిఐ కార్యక్రమం

**- డిండి ఎత్తిపోతల పథకం తక్షణమే పూర్తి చేయాలి**

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి**

**నాంపల్లి, అక్షిత న్యూస్:** మండలంలోని ఇంటి ఇంటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండ తిమ్మాపురం, సుంకీశాల, ముష్టిపల్లి, దేవత్ పల్లి, ఫకీర్ పురం గ్రామాలలో సిపిఐ పార్టీ మండల టీంతో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జనం పాట జగన్ సిపిఐ ఇంటింటి కార్యక్రము నిర్వహించారు. ఈ సందర్భంగా అంజాచారి మాట్లాడుతూ నీళ్ల నిధులు నియామకాల కొరకు పోరాడి 1200 మంది అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ఆ కృషి చేయాల్సిన అవసరం ఉన్నది. 6 గ్యారంటీలను అన్నింటిని అమలు చేయాలి ముఖ్యంగా నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధికి చేపట్టిన ఎస్ ఎల్ బి సీ డిండి ఎత్తిపోతల పథకం తక్షణమే పూర్తి చేయాల్సి ఉన్నది.

ఉపాధి అవకాశాల పెంపొందింపుకు పారిశ్రా మిక వ్యవసాయ పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలి నిరుపేదలకు ఇందిరమ్మ గృహ నిర్మాణాలను చేపట్టి పాలనలో పారదర్శకత అవినీతి లేని స్వచ్ఛమైన పాలన అందించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నది. నేడు దేశంలో నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింత బలపడాలని వామపక్ష ప్రజాతంత్ర పురోగామి శక్తులు కోరుకుంటున్నాయి ఈ నేపథ్యంలో తెలంగాణలో ఇంటింటికి సిపిఐ లో భాగంగా పార్టీ కార్యకర్తలు నీ సహాయం కొరకు మీ వద్దకు వస్తున్నారు. శ్రేయోభి లాషులు, వ్యాపారులు, కార్మికులు, ఉద్యోగస్తులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు తనవంతుగా విరాళాలు అందించి పోరాటాల వాటికి చేయూతని ఇవ్వాల్సిందిగా కోరారు.

## హమాలి సంఘం విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన

# దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర అక్షిత న్యూస్:** హమాలి సంఘం విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, అదేవిధంగా 30 లక్షల నిధులతో ఫుడ్ గ్రైన్ స్టోరేజ్ గోదాం భవన నిర్మాణానికి నిర్వహిం చిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... గత పదేళ్లు అధికారంలో ఉండి బిఆర్ఎస్ ప్రభుత్వం హమాలీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, నిరంతరం చమటోడ్చే హమాలీల కష్టాలను గుర్తించి, వారు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా నేడు హమాలీల విశ్రాంతి




భవనాన్ని ప్రారంభించుకున్నామని అన్నారు. తదనంతరం పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లల వివరాలను రియల్-టైమ్‌లో అప్‌డేట్ చేయడానికి, పౌష్టికాహార పర్యవేక్షణను మెరుగు పరచడానికి వీలుగా అంగన్‌వాడీ వర్కర్లకు ఆధునిక 5G స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లె పాగు ప్రశాంత్ , వైస్ ఛైర్మెన్ తిరుపతి రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు మరియు మదనపురం మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ సిబ్బందికి లస్సి, మజ్జిగ పంపిణీ

**ఆలేరు/ అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రోజున మున్సిపల్ కార్మికులకు లస్సి బట్టర్ మిల్క్ ప్యాకెట్లు అందజేసిన ఐఎన్‌టియూసి యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్. గత కొద్ది రోజులుగా ఆలేరు పట్టణ మెయిన్ రోడ్డు ను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులకు ఎండ వేడిమి దృష్ట్యా ఐ ఎన్ టి యూ సి యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ లస్సి, బట్టర్ మిల్క్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు ఇటీవలే స్విపింగ్ మిషన్ కొనుగోలుకు నిర్ణయించడం సంతోషకరమైన విషయమని అన్నారు. వీలైనంత త్వరగా అట్టి మిషను అందుబాటులోకి తేవాలని కార్మికుల పక్షాన కోరారు. ఆలేరు పట్టణం దినదినాభివృద్ధి చెందుతుంది కావున, ఆలేరు మున్సిపల్ కు స్విపింగ్ మిషన్ అవసరం ఉందని గుర్తించి, అట్టి మిషను కొనుగోలు చేస్తున్న ఆలేరు మున్సిపల్ పాలకవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆలేరులో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాట ప్రతిజ్ఞ

**ఆలేరు/ అక్షిత న్యూస్:**

బ్రిటీష్ పాలకులు తెచ్చిన ట్రేడ్ డిస్ప్యూట్స్ బిల్లు వల్ల కార్మిక వర్గానికి నష్టకరమని భావించి పెద్ద ఎత్తున రిబ్లికన్ సోషలిస్టు ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులను సంఘటిత పరిచి పోరాటాలను నిర్వహించిందని కానీ, బ్రిటీష్ వాడు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా చెవులుండీ వినకుండా, కళ్లుండీ చూడకుండా మొండిగా వ్యహరించడంతో 1919 లో కామ్రేడ్స్ భత్కేశ్వర్ దత్, భగత్ సింగ్ లు చెవిటి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా పార్లమెంట్ అసెంబ్లీ లో ప్రాణ హాని తలపెట్టని



పొగ బాంబులను విసిరి నిరసన తెలిపారని, ఆ ఘటన ఆనాడు కార్మిక వర్గానికి, దేశ ప్రజలకు వర్గ చైతన్యాన్ని నింపిందని దాంతో దేశంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని నాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదం తెచ్చిన ట్రేడ్ డిస్ప్యూట్స్ బిల్లు లాగానే నేడు బీ జే పీ మోడీ ప్రభుత్వం 4 కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను తెచ్చి అమలుకు పూనుకున్నదని కార్మికులకు తీరని అన్యాయానికి ఒడిగడుతుందని ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు విమర్శించారు. ఆలేరు లో ఏప్రిల్ 8, 1919 లో భత్కేశ్వర్ దత్, భగత్ సింగ్ లు పార్లమెంట్ అసెంబ్లీ హాల్ లో పొగ బాంబులు వేసి నిరసన తెలిపిన ఏప్రిల్ 8, ని 4 కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు పోరాడతామని ప్రతిజ్ఞ దినం పాటించి బీ జే పీ మోడీ ప్రభుత్వంపై నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర అద్యక్షులు మామిడాల భిక్షపతి, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ జనార్ధన్, పీ ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్ సీత, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, జిల్లా నాయకులు ఇక్కిరి సహదేవ్, కేమిడి ఉప్పలయ్య, బేజాడి కుమార్, మారుజోడు సిద్దేశ్వర్, చిర బోయిన కొమురయ్య, గడ్డం మంకయ్య, వంగాల మధుసూదన్ రెడ్డి, వంగాల నర్సింహారెడ్డి, వంగాల నర్సింహారెడ్డి, సుంచు రాములు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.






# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి భూమి పూజ, మెగా వైద్య సేవల దిశగా అడుగు

**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** మహబూబ్ నగర్ నగరంలోని బండమీది పల్లిలో సద్గురు శ్రీశ్రీశ్రీ మధుసూదన్ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్, "వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ" మిషన్ మరియు శ్రీ జయరామ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించనున్న సాయి ఆరోగ్య సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు వైద్య సేవల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి భారీ ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొన్నదని, ఈ నేపథ్యంలో ఇక్కడే అధునాతన వైద్య సదుపాయాలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరగడం ఒక చారిత్రాత్మక ముందడుగని అన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని, ఉచిత వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక సదుపాయాలతో ఏర్పడనున్న ఈ ఆసుపత్రి ద్వారా జిల్లాలో ఆరోగ్య సేవల ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. మహబూబ్ నగర్‌లో ఆరోగ్య రంగానికి ఇంకా పెద్ద స్థాయిలో అభివృద్ధి అవసరముందని స్పష్టం చేశారు. చిన్న అనారోగ్య సమస్యలకే ప్రజలు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని, పేద కుటుంబాలు అప్పులపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులు సేవలు అందిస్తున్నప్పటికీ, పెరుగుతున్న జనాభా అవసరాలకు అవి సరిపోవడం లేదని, అందుకే ఇలాంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు మరింత అవసరమని తెలిపారు. భవిష్యత్తులో మహబూబ్ నగర్‌ను ఆరోగ్య రంగంలో అభివృద్ధి చెందిన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు మెడికల్ కాలేజీల స్థాపన దిశగా కూడా కృషి చేయాలని సూచించారు. ప్రజల సహకారం, సేవా సంస్థల భాగస్వామ్యం, ఎన్‌ఆర్‌ఐల మద్దతుతో ఈ లక్ష్యాలను సాధించవచ్చని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారం కూడా పొందేందుకు ప్రయత్నిస్తామని, అవసరమైతే ఉన్నత స్థాయిలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, శ్రీ జయరామ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బెక్కెరి రాంరెడ్డి, కళ్యాణ్ , రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్, మద్ది అనంత రెడ్డి, మద్ది యాదిరెడ్డి, హేమంత్ రెడ్డి, కార్పొరేటర్లు రమేష్ బాబు, పాండురంగ రెడ్డి, నాయకులు గోవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తులు నిరంతరం

**- DPRO విష్ణువర్ధన్**

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుల అప్లోడ్‌కు సూచన**

**- ఏప్రిల్‌లో జారీ ప్రక్రియ పూర్తి లక్ష్యం**



**నిర్మల్, అక్షిత బ్యూరో:** జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందని సమాచార పౌరసంబంధాల శాఖ (I&PR) ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అధికారి (DPRO) విష్ణువర్ధన్ తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. అక్రిడిటేషన్ జారీ ప్రక్రియను ఏప్రిల్ నెలలోనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఈ విషయాన్ని గమనించి సమయానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వదంతులను నమ్మొద్దని, అధికారిక సమాచారం కోసం మాత్రమే విశ్వసించాలని ఆయన సూచించారు.

# బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలి

**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్**

**ముగ్గురికి ఏఎస్ఐలుగా పదోన్నతి**

**ఏఎస్ఐగా దామరగిద్ద పి ఎస్ వెంకట్రాములు**

**నారాయణ పేట,అక్షిత ప్రతినిధి:**

ప్రజలకు బాధ్యతాయుతంగా, నిబద్ధతతో సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవం,మర్యాదలు మరింత పెరుగుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ పేర్కొన్నారు.నారాయణపేట జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నారాయణపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన పి. బాలస్వామి,దామరగిద్ద పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్. వెంకట్ రాములు గౌడ్, మద్దూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎం.వాసు రామ్ లు హెడ్ కానిస్టేబుల్ హోదా నుండి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏ ఎస్ ఐ)లుగా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా వారు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ వారికి ఏ ఎస్ ఐ "వన్ స్టార్"ను అలంకరించి అభినందనలు తెలియజేశారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.... పదోన్నతి అనేది కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా,మరింత బాధ్యతను కూడా తెస్తుందని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా, నమ్మకాన్ని కలిగించే విధంగా విధులు నిర్వహించాలని, ముఖ్యంగా నిరుపేదలు,



బాధితులకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు.

అలాగే ప్రజలతో సానుభూతితో వ్యవహరించి, న్యాయం అందించే దిశగా కృషి చేయాలని, విధుల్లో క్రమశిక్షణ,నిజాయితీ, సేవా భావం కలిగి ఉండాలని పేర్కొన్నారు.ప్రజల నమ్మకం పొందడం పోలీసుల ప్రధాన బాధ్యత అని,అది సాధ్యమవ్వాలంటే ప్రతి పోలీస్ అధికారి ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో పనిచేయాలని సూచించారు.

ఏ ఎస్ ఐ లుగా పదోన్నతి పొందిన ఈ ముగ్గురు సిబ్బంది నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖలో ఒకే రూల్.. ఒకే వ్యవస్థ అమలు చేయాలి

**తొర్రూరు, అక్షిత న్యూస్:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు తోరూర్ సమ్మెలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ చైర్మన్ ధరావత్ సికిందర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ఒకే రూల్ ఒకే వ్యవస్థ అమలు చేయాలని ఆర్టిజన్ కార్మికులందరినీ కన్వర్షన్ ఏపీ ఎస్ ఇబి రూల్స్ వర్తింపజేయాలని అన్మాడ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని స్పాట్ బిల్లర్స్ ఫీజు రీడ్ కార్మికులు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఇటు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఈరోజు నుంచి నిరువదిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఇట్టి కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ మచ్చ సతీష్ డివిజన్ చైర్మన్ పసుపులేటి మధు కన్వీనర్ బందార శ్రీను కో చైర్మన్ నాగరాజు కో



కన్వీనర్ రమేష్, ప్రకాష్, ఖాజాబీ, జ్యోతి, స్వప్న, ఉపేందర్, సునీల్,శతర్ పాషా హరిప్రసాద్, బంధు శ్రీను రామకృష్ణ సందీప్ అశోక్ పుల్లయ్య మధు సుదర్శన్ వివిధ సెక్షన్ల నుంచి ఆర్టిజన్స్ అనుమ్యాన్ కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా మూల నక్షత్ర పూజలు

### -భక్తులతో కిటకిటలాడిన ఆలయం

### - అమ్మవారికి ప్రత్యేక పూజలు

**జగిత్యాల, అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణానికి సమీపంలోని నూకపెల్లి అర్బన్ కాలని సరస్వతి నగర్ లో కొలువై ఉన్న శ్రీ సరస్వతి దేవి ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రం అయిన మూల నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు ఉదయం అమ్మవారి మూల విరాట్ కి అభిషేకం నిర్వహించి తదుపరి పూలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు తదుపరి భక్తుల చే ఉదయం 9 గం.లకు సరస్వతి హోమం నిర్వహించారు తదుపరి కోరిన కోరికలు తీర్చుతున్న చదువుల తల్లికి భక్తులు



ముడుపులు కట్టుకున్నారు ఉదయం 10గం లకు చిన్న పిల్లలకు అక్షరబ్యాసాలు ఘనంగా నిర్వహించారు తదుపరి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు ఈ మూల నక్షత్రం సందర్భంగా ఆలయ కమిటీ వారిచే విచ్చేసినటువంటి భక్తులకు 12 గం లకు విచ్చేసినటు వంటి భక్తులకు అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలోఆలయ పౌండర్ మాజీ ఎమ్మెల్సీ బండారి కమలాకర్ రావు దంపతులు, కార్యదర్శి బండారి వేణుగోపాల్ రావు దంపతులు,ఆలయ కమిటీ సభ్యులు వెన్నమనేని కృష్ణారావు దంపతులు, గంప రాములు, చకినం ప్రసాద్ ,బోనగిరి సురేష్, ఏలిమిల్ల సత్తయ్య, బాపురెడ్డి ఆలయ అర్చకులు కేతరాజు లక్ష్మి నర్సింహ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# గుజ్జరు ఉమాదేవికి నివాళ్ళుఅర్పించిన కాంగ్రెస్ నాయకులు

**ఖమ్మం /అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 30 వ వార్డు సాయి బృందవన్ కాలనీ కి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని గుజ్జరు ఉమా దేవి గుండెపోటు తో మృతి చెందిన విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ధ్వారా తెలుసుకొని సాయి బృందవన్ కాలనీ లోని వారి స్వగృహం నందు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం తో ఉండాలని ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్. ఈ సందర్భంగా వారితో పాటు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కొట్టం రంజిత్ రెడ్డి అప్పలనేని



తారకరామారావు భద్రా రెడ్డి భద్రా చారీ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు, ఏటిఎంల వద్ద అప్రమత్తత ఉండాలి

### - నారాయణపేట సీఐ శివశంకర్

**నారాయణ పేట,అక్షిత ప్రతినిధి:** నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం పోలీసు అధికారులు బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కస్టమర్లకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీలు నారాయణపేట సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా అధికారులు పలు బ్యాంకులను సందర్శించి, అక్కడికి వచ్చే కస్టమర్లతో మాట్లాడి నగదు లావాదేవీల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసి ఇంటికి తీసుకెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



అధికారులు మాట్లాడుతూ... బ్యాంకులు, ఏటీఎంల వద్ద రోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు లావాదేవీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దొంగలు కస్టమర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా అధిక మొత్తంలో నగదు డ్రా చేసే వారిని గమనించి, వారి వెంట వెళ్లి మార్గమధ్యలో దొంగతనాలకు పాల్పడే ఘటనలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. కస్టమర్లు తప్పనిసరిగా ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఏటీఎం వద్ద అపరిచితులకు కార్డు ఇవ్వకూడదు

ఏటీఎం పిన్ నెంబర్ ఎవరితోనూ పంచుకోకూడదు

అపరిచితులు చెప్పే మాటలను నమ్మరాదు

అధిక మొత్తంలో డబ్బులు తీసుకెళ్తున్నప్పుడు ఒంటరిగా కాకుండా ఇద్దరు లేదా ముగ్గురు కలిసి వెళ్లాలి

డబ్బులు తీసుకున్న వెంటనే నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా జాగ్రత్తగా ఇంటికి చేరుకోవాలి

ఇంకా బ్యాంకు పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలాగే సైబర్ నేరాలు జరిగీ అకౌంట్లు డబ్బులు పోతే వెంటనే గోల్డెన్ అవర్స్ లో 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి నేరాలను పూర్తిగా నివారించగలమని అధికారులు తెలిపారు.



# నైపుణ్య శిక్షణ ద్వారా మహిళలకు ఉద్యోగ అవకాశాలు

### జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ

**వరంగల్, అక్షిత బ్యూరో:** బుధవారం ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ వరంగల్ వారి ఆధ్వర్యంలో హనుమకొండలోని శక్తి సదన్ (స్వధార్) హోమ్ లోని మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ సిస్టర సహాయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి విశ్వజా మాట్లాడుతూ వివిధ సమస్యల వలన బాధితులగా మహిళలు ఈ యొక్క స్వధార్ హోం నందు తాత్కాలిక వసతి పొందుతున్నారని ఇలా బాధితులైన మహిళలకు నైపుణ్య శిక్షణలు అందించడం అనేది వారి పునరావాస కార్యక్రమంలో ఒక ముఖ్య భూమిక పోషిస్తుంది అని తెలిపారు పునరావాస వారిలో ఆత్మస్థైర్యాన్ని, వారికి భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

ఈ కార్యక్రమంలో అతిథులు అనితారెడ్డి, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్ ఇక్బాల్ పాషా ,ఎం అజయ్ కుమార్ ,స్వధార్ హోం నిర్వాహకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి వరంగల్ సిపి

### ముల్కనూర్ పోలీస్ స్టేషన్ సందర్శన

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సీపీ పనితీరును తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామీణ ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాలని, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే 'అరైవ్, ఆలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగహన కల్పిస్తూ





కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

స్టేషన్ రికార్డులను పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ గ్రామాల హిస్టరీ షీట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు, సిబ్బంది గ్రామాల పర్యటనలను తరచుగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, ఎస్.ఐ రాజు పాల్గొన్నారు.



# డిగ్రీ విద్యార్థులకు బ్యాక్లాగ్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

### ఎస్ఎఫ్ఐ -పాలమూరు యూనివర్సిటీ

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:**

పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు రెండు,నాలుగు, ఆరవ సెమిస్టర్ తో పాటు ఐదవ సెమిస్టర్ సప్లమెంటరీకి షెడ్యూల్ ప్రకటించారని దానితోపాటు మొదటి,మూడవ సెమిస్టర్ సప్లమెంటరీ కి అవకాశం కల్పించాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ప్రవీణకి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పై తరగతులైన పీజీ, బీఎడ్ ఎంట్రెన్స్ రాయాలన్నా అదేవిధంగా ఇతర ఉద్యోగ అవకాశాల కోసం వెళ్లాలన కచ్చితంగా డిగ్రీ అవసరమని కాబట్టి మానవతా దృక్పథంతో డిగ్రీ ఫైనల్ ఇయర్ రెగ్యులర్ విద్యార్థులకు ఒకటవ,మూడవ సెమిస్టర్ పరీక్షలకు అవకాశం కల్పించాలని వారు కోరారు.ఈ సందర్భంగా ప్రవీణ సానుకూలంగా స్పందించారు, విద్యార్థులకు న్యాయం జరిగేలా అధికారులతో మాట్లాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి బత్తిని రాము ఉపాధ్యక్షులు ఉదయ్,సుధాకర్ సహాయ కార్యదర్శులు తౌపిక్, త్రివేణి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం: కావలి దశరథ

### -సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేత

**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:**

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీ మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి దశరథ చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ ని చేన్న హరినాథ్ కి మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న



గారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పెద్దపులి నాగారం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ ని అందజేయడం జరిగిందన్నారు. కావలి దశరథ మాట్లాడుతూ. గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి మాట్లాడుతూ. మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, లాంటి పథకాలు ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యమవుతుందని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో గణపురం రాజు గ్రామ శాఖ అధ్యక్షులు ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు ఎండి అన్వార్ వైస్ ప్రెసిడెంట్,మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి సిద్దులు గౌడ్,షేకర్ ఖాన్ ఎన్ఎస్ యుఐ మహేశ్వరం గాజులపల్లి నర్సింహా తోపాటు తదితరులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.







# విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, అక్షిత బ్యూరో:** ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, షెడ్యూల్డ్ కులముల సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాల, వసతి గృహాన్ని సందర్శించి తరగతి గదులు, విద్యార్థుల గదులు, వంటశాల, భోజనశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులు చేపట్టిందని, విద్యార్థులకు పూర్తి సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకోవాలని, ఆ దిశగా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుకను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, త్రాగునీరు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వేసవి అయినందున త్రాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల పట్టణంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

### పలు అవినీతి అంశాలు గుర్తించి చర్యల కోసం ప్రభుత్వానికి సిఫార్సు..

**జగిత్యాల అక్షితబ్యూరో:**

కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులు జగిత్యాల మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ సమయంలో, రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, పన్నులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు మరియు కార్యాలయ పనితీరు మొత్తాన్ని పరిశీలించారు; ఈ సందర్భంగా పలు అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. వారి తనిఖీలో బహిర్గతమైన అంశాలను తగు చర్యల కోసం ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నట్లు తెలిపారు.

2025-2026 ఆర్థిక సంవత్సరానికి గాను

వసూలు చేయవలసిన మొత్తం
ఇప్పటివరకు వసూలైన మొత్తం
వసూలు కాని మొత్తం / బకాయి

ఆస్తి పన్ను
రూ. 14,76,10,000/-
రూ. 7,52,64,000/-
రూ. 7,23,46,000/-

షాపింగ్ కాంప్లెక్స్ ఆస్తి పన్ను
రూ. 2,35,07,000/-
రూ. 1,43,19,000/-
రూ. 91,88,000/-

ప్రకటనల పన్ను
రూ. 8,12,510/-
ఏమీ లేదు (Nil)
రూ. 8,12,510/-

మొత్తం
17,19,29,510/-
8,95,83,000/-
8,23,46,510/-

1. తనిఖీ సమయంలో, 2022 నుండి (04) APE ఆటోలు మరియు 2020 నుండి ఒక ట్రాక్టర్ కనిపించడం లేదని తెలిసింది. ఇప్పటివరకు దీనిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.అలాగే, ఇప్పటివరకు దీనిపై ఎటువంటి ఫిర్యాదు కూడా నమోదు కాలేదు.

2.వాహనాల మరమ్మతులకు సంబంధించిన చెక్కులను, జగిత్యాల మున్సిపాలిటీ AE అయిన M.A. అనిల్ పేరు మీద జారీ చేయడం/డ్రా చేయడం జరిగింది. DDO (ఆహరణ మరియు పంపిణీ అధికారి) నిబంధనల ప్రకారం, మరమ్మతులు నిర్వహించిన సంస్థలకే నేరుగా 'అకౌంట్ పే' (Account Pay) పద్ధతిలో మాత్రమే చెక్కులను జారీ చేయాల్సి ఉంటుంది.

3.జగిత్యాల పట్టణం & జిల్లాలో సర్వీసింగ్ చేయించడానికి బదులుగా, వాహనాలను సర్వీసింగ్ కోసం కరీంనగర్‌లోని కోతి రాంపూర్‌లో ఉన్న తెలంగాణ ఆటోమొబైల్స్‌కు క్రమం తప్పకుండా పంపేవారు.

4. లాగ్ పుస్తకాలను నిర్వహించలేదు, ఇంధన వినియోగం మరియు ఓడోమీటర్ రీడింగులను లాగ్ పుస్తకాలలో సరిగ్గా నమోదు చేయలేదు.

5. మున్సిపల్ కాంప్లెక్స్‌లో 194 దుకాణాలు ఉన్నాయి. 18 సంవత్సరాల క్రితం టెండర్ పిలిచి, అందులో పాల్గొన్న వారికి కేటాయించడం జరిగింది, ఇది నేటికీ కొనసాగుతోంది. కానీ మున్సిపల్ అధికారులు రిజిస్టర్ నిర్వహిస్తున్నారు కానీ దుకాణాల నుండి వసూలు చేసిన అద్దె వివరాలను పేర్కొనడం లేదు.

6.మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు సంబంధించి ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మున్సిపల్ అధికారులు టెండర్లు నిర్వహించాల్సి ఉండగా, వారు గత 18 సంవత్సరాలుగా టెండర్లు నిర్వహించడం లేదు

7. తనిఖీ సమయంలో, రికార్డుల నిర్వహణ మరియు రాబడి వసూళ్లలో మరి కొన్ని అవకతవకలు కూడా గమనించబడ్డాయి, వీటికి సమగ్ర పరిశీలన అవసరం.

8. సిబ్బంది మొబైల్ ఫోన్‌ల తనిఖీ సమయంలో, అనుమానాస్పద లావాదేవీలు గమనించబడ్డాయి. ముఖ్యంగా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ పాముకుంట్ల ఆనంద్ కుమార్ గారి మొబైల్ ఫోన్‌ను తనిఖీ చేయగా,జూలై-2025 మధ్య కాలంలో జరిగిన సుమారు రూ. 1,00,000/- విలువైన కొన్ని అనుమానాస్పద యూపీఐ లావాదేవీలు కనుగొనబడ్డాయి. వీటిని ధృవీకరించాల్సి ఉంది.

9.మొత్తం 9047 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు అందగా, వాటిలో 1944 మంది దరఖాస్తుదారులు ప్రాసెసింగ్ కోసం రుసుము చెల్లించారు. వీరిలో 1003 ఆమోదించబడ్డాయి, 206 తిరస్కరించబడ్డయి మరియు 735 వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్నాయి.

10.పని కోసం యూనిఫాం కొనుగోలులో అవకతవకలు. స్టాక్ రిజిస్టర్, చెల్లింపుల రిజిస్టర్ నిర్వహించడం లేదు.

11. ఫాగింగ్ కోసం ఉపయోగించే రసాయనాలకు రిజిస్టర్ నిర్వహించడం లేదు.

12. స్టేషనరీ కొనుగోళ్లకు సంబంధించి జీఎస్టీ బిల్లులు సమర్పించలేదు, బిల్లులపై తేదీలు పేర్కొనలేదు, సరైన అధీకృత బిల్లులు లేవు.

13. దుకాణాల నుండి ఏక వినియోగ ప్లాస్టిక్ స్వాధీనం చేసుకోవడం మరియు అలా స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేయడం తదితర వివరాలను నమోదు చేసే రిజిస్టర్ ఏదీ నిర్వహించబడటం లేదు. ఈ విషయానికి సంబంధించి ఎటువంటి సంబంధిత సమాచారం కూడా సమర్పించబడలేదు. 14. ఉద్యోగుల హాజరు రిజిస్టర్ సరిగ్గా నిర్వహించబడటం లేదు.

15.ఉద్యోగులు 'స్మార్ట్ టచ్ బయోమెట్రిక్ హాజరు విధానాన్ని' క్రమం తప్పకుండా వినియోగించడం లేదు.

16.జరిగిన లోపాల తీవ్రతను నిర్ధారించడానికి మరియు సంబంధిత అధికారులపై బాధ్యతను నిర్ణయించడానికి రికార్డుల తదుపరి పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది.

17. బాధ్యులైన మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తూ, ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదిక సమర్పించబడుతుంది.

# జగిత్యాల జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మె చేపట్టిన తెలంగాణ విద్యుత్ ఆర్టీజన్స్ ఉద్యోగులు

### -పాలకులు మారిన తమ బతుకులు మారడం లేదని ఉద్యోగుల ఆవేదనలి




**జగిత్యాల, అక్షితబ్యూరో:** రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జేఏసీ సూచనలతో జగిత్యాల జిల్లా కేంద్రంలో విద్యుత్ ఆర్టిజన్స్ ఆన్ మ్యాన్ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ డివిజన్ కార్యాలయం ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించిన ఉద్యోగులు, విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్స్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్ల కార్డులు ప్రదర్శించారు., టీజీఎస్పీడీసీఎల్‌లో అన్ మాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేయాలని, 2026 పిఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో 2016 డిసెంబర్ 4 కంటే ముందు అన్ని అర్హతలు ఉండి పనిచేస్తూ, ఇప్పటికీ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మి కులుగా కొనసాగుతున్నవారిని ఆర్టిజన్స్‌గా గుర్తించాలని కోరారు. విద్యుత్ సంస్థలు బ్రిటిష్ కాలం నాటి విధానాలే కొనసాగుతున్నాయని పాలకులు, ప్రభుత్వాలు మారిన తమ బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీఓ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

### - పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు (08-04-2026) పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.

సెక్టర్ సబ్-ఇన్‌స్పెక్టర్ ఎస్సై, జెడ్ సిసి సభ్యులు, సైబర్ సింబా సైబర్ సింబల్ సిబ్బంది పోలీస్ స్టేషన్ సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా శ్రీరామ్ కాలనీ, మామిడిపల్లి తుక్కుగూడ ప్రాంతాల్లో బృందాలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. అలాగే, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించే అవగాహన కరపత్రాలను పంపిహలెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనగా, పోలీసులు వివిధ రకాల సైబర్ మోసాల గురించి వివరించారు. ప్రధానంగా ఈ క్రింది జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

నకిలీ లింకులు గుర్తుతెలియని వ్యక్తులు పంపే నకిలీ లింకులను క్లిక్ చేయవద్దు. బెదిరింపు లేదా మోసపూరిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

ఓటీపీ గోప్యత మీ ఓటీపీ లు, పాస్‌వర్డ్‌లు లేదా బ్యాంక్ ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదు. సోషల్ మీడియా

సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో పరిచయాల విషయంలో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా 'సెక్స్‌టార్షన్' (సెకతోరషన్ ) కు దారితీసే వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. సురక్షిత బ్యాంకింగ్ ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీల కోసం ఎల్లప్పుడూ నమ్మకమైన, సురక్షితమైన నెట్‌వర్క్‌లను మాత్రమే ఉపయోగించాలి. మోసపూరిత స్కామ్‌లు ఉద్యోగాల పేరిట జరిగే మోసాలు (జాబ్ ఫ్రాడ్స్ ), లోన్ యాప్ స్కామ్‌లు ఇటీవల వినబడుతున్న డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసగాళ్లు సామాన్యులను ఏ విధంగా లక్ష్యంగా చేసుకుంటారో కొన్ని వాస్తవ ఉదాహరణలతో వివరించడం జరిగింది. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, వెంటనే గోల్డెన్ అవర్ తొలి గంట లోగా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించాలని లేదా హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి కాల్ చేయాలని సూచించారు. పైన పేర్కొన్న అన్ని ప్రాంతాల్లో ప్రజల నుండి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి పౌరుడికి అవగాహన కల్పించే వరకు ఈ కార్యక్రమాన్ని దశలవారీగా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# భైంసాలో సబ్ ట్రెజరీ కార్యాలయం ప్రారంభం

### డిటిఓ ఎస్. సరోజ చేత ప్రారంభం

### - పారదర్శక సేవలు అందించాలని సూచన




**నిర్మల్ అక్షిత బ్యూరో, భైంసా:**

భైంసా పట్టణంలోని గాంధీ గంజ్ ఆవరణలో ఉన్న సబ్ ట్రెజరీ (ఘా) కార్యాలయాన్ని మార్చుతూ, ఈ-సేవ కాంప్లెక్స్ పక్కన ఉన్న పాత వ్యవసాయ కార్యాలయం భవనంలో నూతనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ట్రెజరీ అధికారి (ఘా) ఎస్. సరోజ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా స్థానిక ఏటిఓ జె. గంగాధర్ అయ్యా, భైంసా ఎస్టీఓ ఎండి. నజీమ్ డిటిఓకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాట్లాడిన డిటిఓ ఎస్. సరోజ, భైంసా ప్రాంత ప్రజలకు మెరుగైన, వేగవంతమైన ట్రెజరీ సేవలు అందించడమే ఈ కార్యాలయం లక్ష్యమని తెలిపారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

భైంసా ఎస్టీఓ ఎండి. నజీమ్ మాట్లాడుతూ, కొత్త కార్యాలయం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎస్టీఓ ఎస్. రమేష్, సీనియర్ అకౌంటెంట్ జె. మనోహర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, ఉపాధ్యాయుల సంఘం, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, అలాగే పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. లక్ష్మణ్, ఎండి అబ్దుల్ ముజాహిద్, వల్లి ఉల్ల హుసేని, గంగ ప్రసాద్ హెడ్‌మాస్టర్ తదితరులు హాజరయ్యారు.

# మంగళ్ పాండే వర్ధంతి ఘనంగా నిర్వహించిన కాకి ఈశ్వర్ ముదిరాజ్

**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:**

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో భారతమాత వీరపుత్రుడు ప్రథమ స్వాతంత్ర సంగ్రామ సేనాని శ్రీ కీర్తిశేషులు మంగళ్ పాండే 170వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు కాకి ఈశ్వర్ మాట్లాడుతూ. మొదటి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న మంగళ్ పాండే అనుచరులు బ్రిటిష్ వారు దాదాపు 700 మంది సైనికులను ఈ విధంగా ఫిరంగి గుల్ల ద్వారా శరీరాన్ని ముక్కలుగా చేసి హింసించి చంపితే వారి త్యాగాల ప్రతిఫలము మనం అనుభవిస్తున్న స్వాతంత్రం అని అన్నారు స్వతంత్ర సమరయోధుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని ఆశన సాధకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ . మహేశ్వరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి. శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్. ఉప్పుగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ రాజు నాయక్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్. మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్. ఆలయ కమిటీ డైరెక్టర్ పేయ్యాల దేవేందర్. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా. సేవాదళ్ మహేశ్వరం మండల అధ్యక్షులు శెట్టి అశోక్. మహేశ్వరం గ్రామ 14వ వార్డు ఇన్చార్జి పుట్లగారి చందు. 10 వ వార్డు ఇన్చార్జి కాకి మల్లేష్ ముదిరాజ్. 13 వ వార్డు ఇంచార్జ్ మునావత్ అనిల్ నాయక్. కాంగ్రెస్ పార్టీ నాయకులు గగనం ఆంజనేయులు. పినమోని శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉడిమిళ్ళ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథక పనుల గురించి అవగాహన సదస్సు

### గ్రామ సర్పంచ్ రామావత్ భాస్కర్ నాయక్

**అచ్చంపేట, అక్షిత ప్రతినిధి:**

పదరా మండల పరిధిలోని ఉడిమిళ్ళ గ్రామంలో గ్రామ సర్పంచ్ రామావత్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారి సుధాకర్ గ్రామ ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథక పనుల గురించి అవగాహన కల్పించారు. సర్పంచ్ మరియు మండల అభివృద్ధి అధికారి సుధాకర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పనులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, వేసవికాలం ఉన్నది కాబట్టి పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, రైతులు తమ తమ పొలాల చదును, అభివృద్ధి పనులు చేయించడం, ఇంకుడు గుంతలు మరియు మరుగుదొడ్లను అందరూ నిర్మించుకోవాలని తెలిపారు.



ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామావత్ భాస్కర్ నాయక్ తో పాటు, మండల అభివృద్ధి అధికారి సుధాకర్, మండల పరిషత్ అధికారి హన్మ నాయక్, గ్రామ కార్యదర్శి శంకర్,ఉపాధి హామీ ఎపిఓ ఆంజనేయులు, ఈసి డ టి.ఎ. రేణయ్య, ఉప సర్పంచ్ కామిరెడ్డి లక్ష్మమ్మ , వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు , మద్దిమడుగు దేవాలయం డైరెక్టర్ నాగిరెడ్డి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.